# చిన్నకథ: ఆధునిక సాహిత్య స్వరూపం

కొడవటిగంటి కుటుంబరావు

మానవ సమాజం పుడుతూనే కథ అనేది పుట్టిఉండాలి. ఆది మానవులు ఎక్కువ విశ్రాంతి విరామాలు కలవారు కారు. వారి కాలమంతా ఆత్మ రక్షణతోనూ, ఆత్మ పోషణతోనూ గడిచిపోయేది. ఆ సమాజంలో ఉత్పత్తి సాధనాలు చాలాకొద్దిగా ఉండడంవల్ల వాళ్ళు తమ కనీస అవసరాలు గడుపుకునేటందుకైనా తీరని కృషి చేయవలసి ఉండేది. ఇంత అవిరామ కృషితోనూ వారు సాహిత్యం సృష్టించలేదనుకో నవసరం లేదు. కాని ఆ సాహిత్యం వారు చేసే నిత్య సమాజిక కర్మకు సంబంధించి ఉండేది. అంతేకాదు, అది వారి సాంఘిక కార్యాచరణకు అవసరమైనకూడా ఉండేదేమో.

కాని ఆ సమాజంలో కథలకున్న స్థానం వేరు. గేయాలూ, పాటలూ ఆనాటి సామాజిక శక్తులను సామాజిక కర్మ సాగించే నిమిత్తమై ఆవాహన చేసేవి. కథలు విశ్రాంతి సమయంలో పైకి వచ్చేవి. వాటిద్వారా ఆ సమాజపు వ్యక్తులు తమ జ్ఞానాన్ని పెంపొందించుకునేవారు. వాళ్ల కథలు నిజానికి సాహిత్యంకావు. వాటి పరమార్థం రసనిష్పత్తి కలిగించటం కానేకాదు. వయోవృద్ధులూ, అపూర్వానుభవాలు గడించినవారూ, దేశాటనచేసి కొత్త విషయాలు తెలుసుకున్నవారూ కథలు చెప్పేవారు. మిగిలినవాళ్లు వినేవాళ్లు. ఇతిహాసాలద్వారా చరిత్రా, సాంఘిక విజ్ఞానమూ ఒకతరంనుంచి మరొక తరానికి సంక్రమిస్తూ ఉండేవి. ఈవిధంగా నాగరికతతో బాటు అంతులేని కథా వాఙ్మయం పెరుగుతూ వచ్చింది. పురాణాలనిండా అసంఖ్యాకమైన కథలు చేరాయి. అయితే ఈనాటి చిన్నకథకూ ఈ కథలకూ ఏమీ సంబంధం లేదు.

ఆనాటి కథలు చరిత్రను ప్రచారం చేశాయి. అందులో సంఘ నీతికూడా శాకతాళీయంగానే ఉండేది. ఆనాడు కథఅనేది ప్రత్యేక సాహిత్యరూపంకాదు. అప్పటి సాహిత్యంలో కథ అంతర్భూతమై ఉండేది. అయినా సాహిత్య స్వరూపాలు కొత్తవి ఉత్పత్తి అయి అభివృద్ధిచెంది సాహిత్య పరిణామం సాగినకొద్దీ కథ అభివృద్ధి చెందడానికి మారుగా కవిత్వమే అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఈ విషయం తెలుగు సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తుంది.

కథ చెప్పటంలో నన్నయ్యకూ, తిక్కన్నకూ, పోతన్నకూ ఉన్న దక్షత ప్రబంధయుగం వారికి లేదు. ఆ తరువాత వచ్చిన అసంఖ్యాకులైన ప్రబంధకారులలో కళాపూర్ణోదయం రచించిన పింగళి సూరన్న వంటి వారిని ఒకరిద్దర్ని తీసివేస్తే మిగిలిన వారికి కథనం చాతేకాదని చెప్పవచ్చు. అయినా వీరు కవిత్వం చెప్పటంలో చిత్రవిచిత్ర ప్రతిభలు ప్రదర్శించారు.

ఇటువంటి పరిణామంలో ఆధునిక-చిన్న కథ ఒక ప్రత్యేక సాహిత్యకళా స్వరూపంగా అభివృద్ధి చెందటం ఒక విచిత్రమైన సన్నివేశం. దాని కెన్ని సాంఘిక శక్తులు ఎంతగా తోడ్పడ్డాయో తెలుసుకుంటేనేగాని సాహిత్యంలో చిన్న కథకుగల స్థానాన్ని సరిగా అంచనా కట్టలేం.

చిన్న కథనుగురించి మనం తెలుసుకోవలసిన మొట్టమొదటి అంశ మేమంటే ఇది ఏ ఇతర ఆధునిక సాహిత్య స్వరూపంకన్న కూడా ప్రజా జీవితానికి అతి సన్నిహితంగా వచ్చింది. సంఘంలో ఉండే ప్రతివ్యక్తికీ కథా నాయకుడయ్యే అర్హత ఉన్నది. ఒక విధంగా చూస్తే రాజులకూ మహారాజులకూకంటె ప్లీడరు గుమాస్తాలకూ, బడిపంతుళ్ళకూ, విద్యార్థులకూ, పాలేళ్ళకూ, బిచ్చగాళ్ళకూ చిన్న కథలో ఎక్కువ ఆదరం ఉన్నది. సంఘంలోని వ్యక్తుల నిత్యజీవితంలో ఏ భాగాన్నయినా చిన్నకథ చిత్రించగలదు. చిన్నకథ పుట్టకపూర్వం సంఘంలో ఇంత స్వాతంత్ర్యం సంపాదించుకున్న సాహిత్య స్వరూపం లేనే లేదంటే అతిశయోక్తి కాదు. "గళ్లచీర", "నల్లబించె-దుక్క-చెంబు", "చల్లపులుసు" మొదలైన కథల పేర్లు ఈ విషయాన్ని రుజువుచేస్తాయి.

అట్లాగే "భగ్నవీణ", "అగ్నివీణ", "రాలిన పూలు", "రుధిరజ్యోతి" మొదలైన పేర్లు వింటే ఇవి ఈనాటి కథల పేర్లు కాజాలవని తోస్తుంది.

పాత్రల విషయంలోనూ, పేర్ల విషయంలోనూ, సన్నివేశాలలోనూ కూడా చిన్నకథ ప్రజాజీవితానికి అతి దగ్గిరగా వచ్చింది. శర్మ కాఫీ తాగటం ఒకకథ. చిన్నపాటి ఉద్యోగం చేసుకునేవాడు తన భార్యను సినిమాకు తీసుకు పోవటం ఒకకథ.

ఇట్లాగే భాష విషయంలోకూడా చిన్నకథ ప్రజలకు చాలా దగ్గిరగా రాగలిగింది. గిడుగువారి వ్యావహారిక భాషావాదాన్ని తొలిభావకవులంతా ఆమోదించినప్పటికీ అమలులోకి తెచ్చినవారు కథకులు. ఈనాడు చిన్నకథను గ్రాంథిక భాషలో రాయటంవల్ల కథా సాహిత్యానికి జరిగే సేవ సంశయాస్పదం. కథకుడు స్వేచ్ఛగా తనభాషలో కథ చెప్పటంతోకూడా తృప్తిపడక తాను తీసుకునే పాత్రల భాషలోనే కథ యావత్తూ నడిపించటం ఆరంభించాడు. గోఖలేవంటి ఒకరిద్దరు కథకు లీవిధంగా రసవత్తరమైన కథలు రాశారు.

ఇటువంటి సాహిత్య స్వరూపం సాధ్యంచేసిన సాంఘిక శక్తులేవి? మొదటి ప్రపంచ సంగ్రామానంతరం ప్రజాస్వామిక శక్తులు ఇండియావంటి పరాధీన దేశాలలోకూడా తలయెత్తి విజృంభించాయి. ఒకవంక రాజకీయ రంగాలలో ఇవి సహాయ నిరాకరణోద్యమానికి దారితీస్తే మరొకవంక సాహిత్య రంగంలో ఖండ కావ్యాలలోని భావ కవిత్వానికీ, చిన్నకథలకూ దారితీశాయి. ఈ సాంఘిక విజృంభణకు వెన్నెముక వ్యక్తివాదము, వ్యక్తిస్వాతంత్ర్యమూనూ. భావకవి తన స్వంత ఆవేశాలను అతి పవిత్రంగా భావించి, వాటికి ఉదాత్తమైన స్వరూపం ఇచ్చి, వాటిని ప్రకటించుకోవటంతో బాటు తన స్వాతంత్ర్యాన్నికూడా ప్రకటించుకున్నాడు. ఇతడు సంఘాన్నీ, సంఘ నియమాలనూ ధిక్కరించి అందరి మెప్పూ సంపాదించాడంటే దానికి కారణం, అప్పుడు ఇంకా అమలులో ఉండిన సంఘ నియమాలు శిథిల మవుతున్నవి. అవతల ప్రజాస్వామిక శక్తులు చరిత్ర పరిణామాన్ని ఆసరా చేసుకుని ఆ నియమాలమీద ధ్వజం ఎత్తే ఉన్నది. భావకవి ఏ వ్యక్తి వాదాన్ని ప్రకటిస్తున్నాడో ఆవ్యక్తి వాదమే సంఘంలో ఉన్న ప్రతి వ్యక్తినీ చైతన్యవంతుణ్ణి చేస్తూఉండడంవల్ల తాత్కాలికంగా వ్యక్తివాదం కూడా ఒక సాంఘిక శక్తిగా రాణించింది.

అయితే ఈ వ్యక్తివాదంలో కథకుడు భావకవిని మించి చాలా ముందుకు పోగలిగాడు. కారణ మేమంటే కథకుడు భావకవికన్న కూడా ప్రజాజీవితానికి సన్నిహితంగా వెళ్లగలిగాడు. ఎంత వ్యక్తివాదిఅయినా భావకవి కొంత విశిష్టతను తనలో ఉంచుకున్నాడు, సంఘానికి ఎడంగా ఉండ గోరాడు. కాని కథకుడు సంఘంలో కలిసిపోయినాడు. సాధారణ వ్యక్తుల కందరికీ ప్రతినిధిగా నిలబడి వారిజీవితాన్ని వివిధ ఆశయాలతో వివిధ రీతుల చిత్రించ సాగాడు.

చిన్న కథలు రాసేవాడు తన వ్యక్తిత్వాన్ని తాను చిత్రించే పాత్రలద్వారానూ, భావాలద్వారానూ, సన్నివేశాలద్వారానూ మాత్రమే కాక తన శిల్పంలోకూడా చిత్రించసాగాడు. చిన్న కథయొక్క శిల్పానికి అవధులు లేవు. ప్రతి ఒక్క కథకుడూ తన ప్రత్యేకతను శిల్పంలోనే చూపవచ్చు. చలం, మునిమాణిక్యం, దీక్షితులు మొదలైన కథకుల రచనలు ఒకరివి మరొకరివని పొరపాటు పడటానికి అవకాశమే లేదు.

చిన్న కథకులు సాధించిన ప్రయోజనాలలో కూడా వైవిధ్యం ఎంత ఉన్నదో దానికి తగ్గట్టే వ్యక్తిత్వంకూడా ఉన్నది. మునిమాణిక్యంగారి కథలు అచ్చగా గృహజీవితాన్ని చిత్రించి అందులో పఠితలకు ఆసక్తి కలిగించాయి. చలంగారి రచనలు పాతకాలపు సాంఘిక నీతినీ, ఆచారాలనూ తూర్పారబట్టాయి. దీక్షితులుగారు చిన్నపిల్లల కథలనూ, "కరుణకుమార" గ్రామీణ జీవితాన్నీ, గోఖలే క్షుద్రజీవులనూ చిత్రించి తమతమ ప్రత్యేకతలను చాటుకున్నారు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి మొదలైన అనేక కథకులు చిన్న కథను అనేక రకాలుగా ఉపయోగించుకున్నారు.

చిన్న కథయొక్క వ్యాప్తికి ఆధునిక యంత్ర పరికరాలుకూడా ఎంతో ఉపయోగించాయి. తాటాకులమీద గంటాలతో పుస్తకాలు రచించే

రోజులలో ఈనాటి చిన్నకథ ఒక ప్రత్యేక సాహిత్య స్వరూపంగా వేరుపడి అభివృద్ధి కావటం అసంభావ్యం. పత్రికలూ, సామాన్య ప్రజలలో వాటికి హెచ్చిన ఆదరణా, ఆధునిక అచ్చుయంత్రాలూ చిన్న కథయొక్క వ్యాప్తికీ, ప్రజలలో వాటి ప్రచారానికీ అంతులేని సేవ చేశాయి. కేవలమూ పత్రికలనూ చిన్న కథలనూ ఆశ్రయించుకుని సాహిత్యరంగంలో ప్రవేశించిన వారే ఈనాటి కథకులలో నూటికి తొంభై తొమ్మిదిమంది. పద్యాలు రాసినవాడే సాహితీ పరుడనే నిర్బంధం ఉంటే ఈనాటి ప్రసిద్ధ కథకులలో దాదాపు ఒక్కడైనా సాహిత్యరచన చేసి ఉండకపోవచ్చు.

అదేవిధంగా ఈనాడు కథలు చదివి ఆనందించే లక్షలాది ప్రజలలో చిన్న కథలద్వారా మాత్రమే సాహిత్యాభిలాష రేకెత్తినవారే అత్యధిక సంఖ్యాకులు.

ఈ విధంగా ప్రజా జీవితానికి అతి సన్నిహితంగా పుట్టి రెండు ప్రపంచయుద్ధాల మధ్య కాలంలో చిన్నకథ దిగ్విజయయాత్ర సాగించింది.

# చిఱునవ్వు వెన్నెలలు

"ప్రభాకర్"

పై క్రింది పెదవులు కలిసి ప్రక్కకి కొంత దూరం వ్యాపించడాన్ని చిఱునవ్వు లేక మందహాస మంటారు.

చిఱునవ్వు ప్రేమకు బీజంవంటిది. దానిని బయల్పరచేవారికి వారి ప్రియమైన వానిమీద గల అభిరుచిని ఈ చిఱునవ్వు తెలియజేస్తుంది. ఉదాహరణకి ఓ అబ్బాయి ఒక అమ్మాయిని ప్రేమించాడనుకోండి. అత డెలాగైనా తన ప్రేమ నామెకి తెలియజేసి తనమీద ఆమెకి ప్రేమఉందో లేదో తెలుసుకోటానికి చిఱునవ్వుపయోగిస్తాడు. ఆమెకి అతనిమీద ప్రేమ ఉంటే వెంటనే చిఱునవ్వు నవ్వి తన ప్రేమని తెలియపర్చవచ్చు. లేక ఆమెకి అతనిమీద ప్రేమ లేకపోతే ముఖకవళికలతో తన అనంగీకారాన్ని తెలియజేయవచ్చు.

పెళ్ళి సంబంధం వచ్చినప్పుడు పెళ్ళి చేసుకోబోయే యువతీ యువకులు పైవిధంగా చిఱునవ్వుతో తమ అభీష్టాలను తెలియ జేయవచ్చు.

ఆఫీసులో చేతులు పడిపోయేటట్లు రాసిరాసి అలసిపోయి చిరాకుతో ఇంటికివచ్చిన గృహస్థుకి ద్వారంవద్ద అతని భార్య చిఱునవ్వుతో ఆహ్వానం ఇస్తే ఆ క్షణంలో అతను పగలల్లా చేసిన పనే మర్చిపోయి తేలిక హృదయంతో ఎంత ఆనందిస్తాడో చెప్ప వలనౌతుందా?

పనీ పాటాకూడా మానుకుని ఇంటిలో భార్య కెదురుగా కూర్చుని ఆమె చిఱునవ్వులోని ఆనందా న్ననుభవిస్తూండేవా రెంతమంది లేరు?

రైళ్ళలోనూ, బస్సుల్లోనూ ప్రయాణంచేస్తూ కొందరి స్త్రీల మాటలనూ, చిఱునవ్వు నవ్వే వారి కళ్ళనూ, ఒళ్ళు మరిచి అదే పనిగా వారి వంక చూచేవారుమటుకు లేరూ?

సినిమాలో నాయకుడు చివరివరకూ నాయికను నానాబాధలూ పెట్టి చివరికి తన తప్పుని తెలుసుకొని ఆ వరారోహను, చిఱునవ్వుతో దగ్గరకు తీసుకున్నప్పుడు కొందరి ప్రేక్షకుల హృదయాలు పల్చబడి ప్రక్కన ఎవరున్నదీకూడా తెలీక 'భేష్' అని అభినందించేవాళ్ళే లేరా?

ఎంతటి ప్రబల విరోధి అయినా ఒక్క చిన్న చిఱునవ్వుతో ప్రియమిత్రు డవవలసిందే. అసలీ చిఱునవ్వు లేకపోతే లోకంలో ఆనందమే లేదేమో.

చిఱునవ్వువలన నష్టాలు లేకపోలేదు.

ఒకప్పుడు ఎంతమంది తరళేక్షణలు ఈ చిఱునవ్వును ప్రదర్శించి ఎందరు పురుషుల్ని తమ దాసులుగా చేసికొని ఎన్నిసంసారాలు నాశనము గావించలేదు?

ఎందరు యువకులు ఈ చిఱునవ్వుతో అమాయికలైన స్త్రీలని లొంగదీసుకుని, క్షణికానందం కోసం పరుగులెత్తి చివరకి చల్లగా తప్పుకుని వారిని రచ్చ కీడవలేదు?

చిఱునవ్వులోని గొప్ప విశేష మేమంటే ఎంతటి గొప్పవాడైనా దానికి తలొగ్గవలసిందే.